సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి..
www.suryaepaper.com

EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com

4 PM
www.suryaa.com
శుక్రవారం
06-02-2026
పేజీలు: 02



కీలక వడ్డీరేట్లు

# యథాతథం..

## 5.25 శాతం వద్దే రెపో రేటు

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కీలక వడ్డీరేట్లలో ఎలాంటి మార్పు చేయలేదు. మునుపటి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ఇవాళ్టి ద్రవ్య పరపతి విధాన సమీక్షలో తీసుకున్న నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన తర్వాత ఆర్‌బీఐ నిర్వహించిన తొలి ద్వైమాసిక సమీక్ష ఇది. గత ఏడాది ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీరేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోతపెట్టింది. ఆ తర్వాత డిసెంబర్‌లో మరో పావు శాతం తగ్గించింది. దాంతో గత ఏడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు దిగొచ్చింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 7.4 శాతం వృద్ధి నమోదవుతుందని ఆర్బీఐ అంచనా వేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికంలో 6.9 శాతం, రెండో త్రైమాసికంలో 7 శాతం వృద్ధి నమోదవ్వొచ్చని పేర్కొంది.



# దొంగల చేతుల్లోకి తెలంగాణ

తెలంగాణ రాష్ట్రం దొంగల చేతుల్లోకి పోయిందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కొత్తగూడెం కార్పొరేషన్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 60వ వార్డులో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. పోలీసులు ఓవరాక్షన్ చేస్తున్నారని, కాంగ్రెస్ కండవాలు కప్పి కార్యకర్తల్లాగా పని చేస్తున్నారని విమర్శించారు. అన్ని పార్టీ నాయకులను సమానంగా చూడటమే పోలీసుల విధులని, అలా లేకుండా కేవలం బీఆర్ఎస్ అభ్యర్థులపై కక్షగట్టి వార్డుల్లో పని చేయకుండా చేస్తున్నారన్నారు. 60వ వార్డులో పోటీ చేస్తున్న బీమా శ్రీవల్లి శ్రీధర్ ఇచ్చిన హామీలను అమలు చేసే బాధ్యత తనదేనన్నారు. కాంగ్రెస్ ఎన్ని కుట్రలు పన్నినా విజయం బీఆర్ఎస్‌దే అన్నారు. కాంగ్రెస్ పాలన ప్రజా పాలన కాకుండా ప్రజా వేదనగా ఉందన్నారు.



# రేవంత్ తిట్ల ట్రాప్ లో పడొద్దు..

# అసలు సమస్యలపై పోరాడండి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారని, ఆయన పన్నుతున్న 'తిట్ల ట్రాప్'లో పార్టీ శ్రేణులు చిక్కుకోవద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ప్రజల అసలు సమస్యల నుంచి చర్చను పక్కదోవ పట్టించేందుకే రేవంత్ రెడ్డి దూషణల పర్వాన్ని ఎంచుకున్నారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ మేరకు పార్టీ శ్రేణులకు, తెలంగాణ ప్రజలకు ఆయన ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వార్డుల్లో రోడ్లు, డ్రైనేజీలు, సంక్షేమ పథకాల అమలు వంటి మౌలిక వసతులపై చర్చ జరగాల్సి ఉండగా, సీఎం రేవంత్ తన 'బూతు పురాణం'తో చర్చను నీరుగారుస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కేసీఆర్‌పై చేస్తున్న దాడిని తెలంగాణ పోరాట చరిత్రపై జరుగుతున్న దాడిగా అభివర్ణించారు. "పద్నాలుగేళ్ల సుదీర్ఘ పోరాటంతో తెలంగాణ స్వప్నాన్ని సాకారం చేసి, రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించిన శిల్పి కేసీఆర్. ఆయన ఏనాడూ బిరుదుల కోసం పాకులాడలేదు. ప్రజల సంక్షేమమే ఆయనకు అసలైన సత్కారం" అని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కేటీఆర్ అన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు కాలేదని, ఈ నమ్మకద్రోహంపైనే మన పోరాటం ఉండాలని శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. "ఎరువుల కోసం క్యూలైన్లలో నిలబడిన రైతుల కష్టాలు, రైతు భరోసా అందక వడ్డీ వ్యాపారుల చేతిలో నలిగిపోతున్న అన్నదాతల ఆవేదనపై ప్రభుత్వాన్ని నిలదీయండి. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు, గురుకులాల్లో విషాహారంతో చిన్నారులు పడుతున్న బాధలకు బాధ్యులెవరని గల్లా పట్టి అడగండి" అని కేటీఆర్ పిలుపునిచ్చారు. డీఏలు, పీఆర్సీ ఊసే లేక ఉద్యోగులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రాక వృద్ధులు పడుతున్న మనోవేదనకు బీఆర్ఎస్ గొంతుకగా నిలవాలని ఆయన సూచించారు. సింగరేణి బొగ్గు స్కామ్, విద్యుత్ కుంభకోణాల వెనుక ఉన్న అసలు దొంగలెవరో ప్రజలకు వివరించాలని కోరారు. తెలంగాణ నీటి వాటాను పక్క రాష్ట్రాలకు ధారాదత్తం చేస్తూ రేవంత్ రెడ్డి ఒక 'కోవర్టు'లా వ్యవహరిస్తూ తెలంగాణకు ద్రోహం చేస్తున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. రేవంత్ రెడ్డి అసమర్థ పాలనపై మున్సిపల్ ఎన్నికల్లో ప్రశ్నలను పిడుగుల్లా కురిపించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలని కేటీఆర్ తన లేఖలో కోరారు. ఇది తెలంగాణకు పట్టిన గ్రహణ కాలమని, ఈ చీకటిని తరిమికొట్టే బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు.

బాలకృష్ణ నియోజకవర్గంలో కాల్పుల కలకలం..

# నిందితుడిపై పోలీసుల ఫైరింగ్

ఏపీలోని శ్రీసత్యసాయి జిల్లాలో కాల్పుల ఘటన కలకలం రేపింది. పోలీసులపై దాడి చేసిన నిందితుడిపై జరిపిన కాల్పుల్లో గాయపడ్డాడు. నందమూరి బాలకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న హిందూపురం నియోజకవర్గం చిలమత్తూరు మండలం టేకులోడు వద్ద కాల్పులు జరిగాయి. గతంలో అత్త, కోడలిపై అత్యాచారం చేసి పరారీలో నిందితుడు నాగేంద్ర కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. సీఐ ఆంజనేయుడు, కానిస్టేబుల్ రవి నిందితుడిని పట్టుకునే క్రమంలో నిందితుడు ఇద్దరిపై కత్తితో దాడి చేసి గాయపరిచాడు. దీంతో పోలీసులు నిందితుడు మోకాలిపై తుపాకితో కాల్చడంతో గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ముగ్గురిని హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

# లవ్లీనా బోణీ



బాక్సమ్ ఎలైట్ ఇంటర్నేషనల్ 2026 టోర్నీలో భారత బాక్సర్ లవ్లీనా బొర్గొహైన్ బోణీ కొట్టింది. స్పెయిన్‌లో జరుగుతున్న ఈ టోర్నీలో భాగంగా గురువారం జరిగిన మహిళల 75 కిలోల తొలి రౌండ్ బౌట్‌లో లవ్లీనా.. 5:0తో ఉక్రెయిన్ బాక్సర్ ఒల్హాపై ఏకపక్ష విజయం సాధించింది. ఆమెతో పాటు మంజు రాణి (48 కి.), నీతూ (51 కి.), కుసుమ్ (51 కి.), అరుంధతి (70 కి.) విజయాలు సాధించారు.



ఆర్‌సీబీ ఘన విజయం..

# ఫైనల్‌లో ఢిల్లీపై ఘనవిజయం



ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) నాలుగో సీజన్ టైటిల్‌ను మాజీ చాంపియన్ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) కైవసం చేసుకుంది. గురువారం వడోదరలో జరిగిన ఫైనల్‌లో ఆ జట్టు.. ఢిల్లీ క్యాపిటల్స్‌ను 6 వికెట్ల తేడాతో ఓడించి ఈ టోర్నీలో రెండో టైటిల్‌ను ఎగురేసుకుపోయింది. వరుసగా నాలుగుసార్లు ఫైనల్ చేరిన ఢిల్లీకి ఈసారీ భంగపాటు తప్పలేదు. క్యాపిటల్స్ నిర్దేశించిన 204 పరుగుల ఛేదనను బెంగళూరు.. 19.4 ఓవర్లలో 4 వికెట్లు మాత్రమే కోల్పోయి దంచేసింది. కెప్టెన్ స్మృతి మంధాన (41 బంతుల్లో 87, 12 ఫోర్లు, 3 సిక్స్‌లు), జార్జియా వోల్ (54 బంతుల్లో 79, 14 ఫోర్లు) రెండో వికెట్‌కు రికార్డు భాగస్వామ్యంతో క్యాపిటల్స్‌కు మరోసారి నిరాశ తప్పలేదు. తొలుత బ్యాటింగ్ చేసిన క్యాపిటల్స్.. బ్యాటర్లంతా సమిష్టిగా రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 4 వికెట్లే కోల్పోయి 203 పరుగుల భారీ స్కోరుచేసింది. జెమీమా రోడ్రిగ్స్ (37 బంతుల్లో 57, 8 ఫోర్లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడగా లారా వోల్వార్ట్ (25 బంతుల్లో 44, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), చినెల్లె హెన్రీ (15 బంతుల్లో 35★, 4 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించారు.

**మంధాన, వోల్ మెరుపులు**

భారీ లక్ష్యఛేదనలో రెండో ఓవర్‌లో 9 పరుగుల వద్దే ప్రమాదకర గ్రేస్ హారిస్ (9) వికెట్‌ను కోల్పోయినా బెంగళూరు వెనక్కి తగ్గలేదు. వోల్‌తో కలిసి మంధాన ధనాధన్ ఆటతో రెచ్చిపోయింది. ఇద్దరూ ఓవర్‌కు రెండు బౌండరీలకు తగ్గకుండా దంచడంతో పవర్ ప్లే ముగిసేసరికి బెంగళూరు 59/1 స్కోరు చేసింది. క్రీజులో కుదురుకున్నాక ఈ ద్వయం ఆ తర్వాత మరింత జోరు పెంచింది. నందని, శ్రీ చరణి వరుస ఓవర్లలో స్మృతి సిక్స్‌లు కొట్టింది. ఇదే క్రమంలో 37 బంతుల్లో వోల్, 23 బంతుల్లో మంధాన అర్ధ శతకాలు పూర్తయ్యాయి. ఇన్నింగ్స్‌ను పూర్తిగా తమ నియంత్రణలోకి తెచ్చుకున్నాక ఈ జోడీ ఓవర్‌కు పది పరుగులకు తగ్గకుండా బాదడంతో బెంగళూరు లక్ష్యానికి చేరువైంది. గెలుపు దిశగా సాగుతున్న ఈ జోడీని ఎట్టకేలకు మిన్ను మణి 17వ ఓవర్లో వోల్‌ను ఔట్ చేయడంతో 165 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. వోల్ నిష్క్రమించినా అప్పటికే ఆర్‌సీబీ విజయం ఖాయమైంది. స్వల్ప వ్యవధిలో రిచా ఘోష్ (6), మంధాన నిష్క్రమించినా రాధా (12★), క్లెర్ (7★) లాంఛనాన్ని పూర్తిచేశారు.

**బాధ్యతగా బాదినా..**

బెంగళూరు ఆహ్వానం మేరకు మొదట బ్యాటింగ్‌కు వచ్చిన ఢిల్లీ ఇన్నింగ్స్ నెమ్మదిగానే మొదలైంది. లారెన్ బెల్ కట్టడి చేయడం (4-0-19-0)తో ఆ జట్టు 3 ఓవర్లకు 9 రన్స్ మాత్రమే చేయగలిగింది.

కృతి శెట్టి కోలీవుడ్

# ఎంట్రీ ఆలస్యం!

ఉప్పెనతో టాలీవుడ్ లో అడుగుపెట్టి, మొదటి మూడు చిత్రాలతో హిట్ అందుకున్న కన్నడ నటి కృతి శెట్టి, ఆ తర్వాత వరుస ఫ్లాపులతో ఇబ్బంది పడుతోంది. తెలుగులో సక్సెస్ దక్కకపోవడంతో మాలీవుడ్ లో ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ ఏడాది కోలీవుడ్ లోకి అడుగుపెట్టాలని భావించినా, ఆమె నటించిన సినిమాలు విడుదల ఆలస్యం అవుతున్నాయి. కార్తీతో నటించిన 'వా వాతియార్' సినిమా షూటింగ్ వాయిదా పడుతూ వస్తోంది. అలాగే 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమా కూడా డిసెంబర్ 18కి వాయిదా పడింది.

# ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ..

## స్పీకర్‌కు మరో 3 వారాలు గడువు ఇచ్చిన సుప్రీంకోర్టు


ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు సుప్రీంకోర్టు చివరిగా మరో అవకాశం ఇచ్చింది. ఎమ్మెల్యేల అనర్హతపై నిర్ణీత కాలంలో నిర్ణయం తీసుకోవాలని సూచిస్తూ మూడు వారాల గడువునిచ్చింది. అనంతరం విచారణను వాయిదా వేసింది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ దాఖలుచేసిన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ అగస్టీన్ జార్జ్‌ల ధర్మాసనం విచారణ చేపట్టారు. గత విచారణ సందర్భంగా.. అనర్హత అంశాన్ని తేల్చాలని



ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తిచేసి కోర్టుకు నివేదిక సమర్పించాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఈ నేపథ్యంలో గత విచారణ తర్వాత జరిగిన పరిణామాలను సుప్రీంకోర్టుకు ప్రభుత్వం తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వి తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఇప్పటికే విచారణ జరుపుతున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

# 'పండిట్' వివాదంపై స్పందించిన మనోజ్ బాజ్‌పేయ్




ప్రముఖ నటుడు మనోజ్ బాజ్‌పేయ్ తన చిత్రం 'పండిట్' టైటిల్ వివాదంపై తాజాగా స్పందించారు. ఈ సినిమా టైటిల్ పండిట్ అనే పదం ఒక వర్గాన్ని కించపరిచేలా ఉందని సోషల్ మీడియాలో ట్రోలింగ్ మొదలైన విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ వివాదంపై దర్శకుడు నీరజ్ పాండే స్పందిస్తూ.. ప్రచార చిత్రాల తొలగిస్తున్నట్లు ప్రకటించాడు. అయితే తాజాగా నీరజ్ నిర్ణయాన్ని సమర్థిస్తూ మనోజ్ కూడా తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా మనోజ్ మాట్లాడుతూ.. మనం భాగమైన ఒక విషయం కొంతమందిని బాధపెట్టినప్పుడు, ఖచ్చితంగా ఆగి వారి మాట వినాల్సిన అవసరం ఉంటుంది. నటుడిగా తాను కేవలం ఒక కథను, అందులోని పాత్రను మాత్రమే చూస్తానని, ఈ చిత్రంలో ఒక వ్యక్తిలోని లోపాలు మరియు అతని ఆత్మపరిశీలన ప్రయాణాన్ని మాత్రమే ప్రతిబింబించామని మనోజ్ వివరించారు. ఇది ఏ వర్గానికి లేదా కులానికి వ్యతిరేకంగా చేసిన సినిమా కాదని ఆయన స్పష్టం చేశారు. దర్శకుడు నీరజ్ పాండే ఎంతో బాధ్యతగా సినిమాలను రూపొందిస్తాడు. ప్రజాభిప్రాయాన్ని గౌరవిస్తూ ప్రచార చిత్రాలను తొలగించడం ద్వారా, తాము ఈ సమస్యను ఎంత తీవ్రంగా పరిగణిస్తున్నామో అర్థం చేసుకోవచ్చని మనోజ్ బాజ్‌పాయి పేర్కొన్నారు.


## ఇస్లామాబాద్ లో భారీ పేలుడు... 15 మంది మృతి



పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ మరోసారి బాంబు పేలుడుతో దద్దరిల్లింది. శుక్రవారం జుమ్మా ప్రార్థనల సమయంలో ఓ షియా మసీదు లక్ష్యంగా జరిగిన ఈ భీకర దాడిలో కనీసం 15 మంది ప్రాణాలు కోల్పోగా, 80 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనను స్థానిక అధికారులు ధృవీకరించారు. ఇస్లామాబాద్‌లోని ఆగ్నేయ ప్రాంతమైన తర్లాయ్ కలాన్‌లోని ఖదీజతుల్ కుబ్రా మసీదులో ఈ ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కావడంతో ప్రార్థనల కోసం పెద్ద సంఖ్యలో భక్తులు హాజరైన సమయంలో పేలుడు సంభవించడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని, క్షతగాత్రులను సమీప ఆసుపత్రులకు తరలించాయి. నగరంలోని ప్రధాన ఆసుపత్రుల్లో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.



## ప్రజలు మిమ్మల్ని తిరస్కరించారు.. ప్రశాంత్ కిషోర్‌పై సుప్రీం ఆగ్రహం



గత ఏడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో.. వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌కు చెందిన జన్ సూరజ్ పార్టీ దారుణంగా ఓడిన విషయం తెలిసిందే. ఆ ఎన్నికల ఫలితాలను రద్దు చేయాలని కోరుతూ ప్రశాంత్ కిషోర్ దాఖలు చేసిన పిటీషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. 2025 బీహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రభుత్వం తన సంక్షేమ పథకంతో ఓటర్లకు డబ్బులు పంచిందని జన్‌సూరజ్ పార్టీ ఆరోపించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన ధర్మాసనం ఆ పిల్‌ను కొట్టిపారేసింది. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించారని, ఇప్పుడు మీరు పబ్లిసిటీ కోసం న్యాయ ప్రక్రియను వాడుకుంటారని చీఫ్ జస్టిస్ అన్నారు. మీకెన్ని ఓట్లు వచ్చాయి, ఒకసారి ప్రజలు తిరస్కరిస్తే, రిలీఫ్ కోసం జుడిషియల్ ఫోరంను వాడుతున్నారని, ఆ స్కీమ్‌ను ఎవరో ఒకరు ముందుగా ఛాలెంజ్ చేసి ఉండాల్సిందని కోర్టు పేర్కొన్నది. అసెంబ్లీ ఎన్నికల్లో జన్‌సూరజ్ పార్టీ మొత్తం 238 సీట్లలో పోటీ చేసి ఒక్క సీటు కూడా గెలవలేదు. అయితే ఆ పిల్‌ను బీహార్ హైకోర్టుకు పంపింది సుప్రీం. కుటుంబంలోని మహిళకు పదివేలు ఇవ్వడాన్ని పార్టీ తప్పుపట్టింది. ఆర్టికల్ 32 కింద తన పిటీషన్ ఫైల్ చేసింది. సుమారు 36 లక్షల మంది మహిళలకు డబ్బులు రిలీజ్ చేసి అధికార పార్టీ అక్రమ విధానాలకు పాల్పడినట్లు జన్‌సూరజ్ తన పిటీషన్‌లో తెలిపింది.

## కానిస్టేబుల్‌ను తినేసిన పులి.. గుర్తు తెలియని వ్యక్తుల కాల్పుల్లో పులి మృతి



అరుణాచల్ ప్రదేశ్‌లో బుల్లెట్ గాయాలతో ఒక పులి మరణించింది. అంతకంటే రెండు రోజులముందు ఒక కానిస్టేబుల్‌ను పులి చంపి తినేసింది. దీంతో ఆ పులిని ఎవరైనా ప్రతీకారంతో కాల్చి చంపారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటన అరుణాచల్ ప్రదేశ్, దిగువ దిబాంగ్ వ్యాలీ జిల్లా, మయోడియా ప్రాంతంలో జరిగింది. సోమవారం సాయంత్రం చిక్సంగ్ మన్పాంగ్ అనే హెడ్ కానిస్టేబుల్ బైకుపై వెళ్తుండగా అతడిపై పులి దాడి చేసి చంపినట్లు తెలుస్తోంది. అతడు కనిపించకపోవడంతో పోలీసులు, ఫారెస్టు అధికారులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం అతడి మృతదేహం లభ్యమైంది. సగం వరకు మృతదేహాన్ని పులి తిన్నట్లు గుర్తించారు. దీంతో స్థానికులు తీవ్ర ఆగ్రహావేశాలకు లోనయ్యారు. పులిని బంధించాలని, అంతం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ప్రజలు ఎవరూ బయటకు రావొద్దని, పులి సంచారం నేపథ్యంలో జాగ్రత్తగా ఉండాలని ఆదేశాలు జారీచేశారు. ఇదే సమయంలో కానిస్టేబుల్‌పై పులి దాడి చేయడాన్ని ఎవరూ చూడలేదు. కానీ, ఆ ప్రాంతంలో పులి సంచరించడాన్ని కొందరు చూశారు. దీంతో అతడిని పులి చంపి ఉంటుందని భావిస్తున్నారు. ఈ ఘటన జరిగిన రెండు రోజుల తర్వాత గురువారం అటవీ ప్రాంతంలో ఒక పులి చనిపోయి కనిపించింది. బుల్లెట్ గాయాలతోనే ఆ పులి మరణించినట్లు గుర్తించారు. అయితే, ఆ పులిని ఎవరు కాల్చి చంపారు అనే విషయంలో స్పష్టత లేదు. కానిస్టేబుల్ మృతికి ప్రతీకారంగా ఎవరైనా కాల్చి చంపారా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. మరణించింది ఆడపులి. అయితే, కానిస్టేబుల్‌పై దాడి చేసింది ఇదే పులా.. లేక మరోటా అనే విషయంలో కూడా స్పష్టత లేదు. ఏదేమైనా అటు అటవీ అధికారుల నిర్లక్ష్యం.. ఇటు మనుషుల చర్యలు వల్ల అటవీ జంతువులకు నివాసం కరువవడం వంటి అంశాలే కానిస్టేబుల్ మరణానికి, పులి ప్రాణం పోవడానికి కారణమైందని జంతు ప్రేమికులు అంటున్నారు. ఘటనలపై విచారణ కొనసాగుతోంది.

## లోక్‌సభలో కొనసాగిన గందరగోళం.. సోమవారానికి వాయిదా

లోక్‌సభలో గందరగోళం ఇవాళ కూడా కొనసాగింది. రాజ్యసభలో గురువారం ప్రధాని మోదీ మాట్లాడుతూ చేసిన విమర్శలపై విపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తంచేశారు. లోక్‌సభలో తమ నాయకుడికి మాట్లాడే అవకాశం ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు. పలువురు సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ప్లకార్డులు ప్రదర్శించారు. స్పీకర్ నచ్చజెప్పే ప్రయత్నం చేసినా వారు వినిపించుకోకపోవడంతో సభను సోమవారానికి వాయిదా వేశారు. లోక్‌సభలో ఈ బడ్జెట్ సెషన్‌లో ఇప్పటికే 19 గంటల 13 నిమిషాల సమయం వృథా అయ్యిందని స్పీకర్ తెలిపారు. సభను సోమవారం ఉదయం 11 గంటల వరకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. కాగా పార్లమెంట్‌లో తొలి విడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 13తో ముగియనున్నాయి. మార్చి 9న రెండో విడత సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 9 నుంచి లోక్‌సభలో బడ్జెట్‌పై చర్చ జరుగనుంది.



# జిగిల్‌మనేలా నేహా అందాలు

తెలుగు కుర్రాళ్ల గుండెల్లో రాధికగా నిలిచిపోయింది నేహా శెట్టి. డీజే టిల్లు సినిమాతో ఒక్కసారిగా సెన్సేషన్ అయిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత మాత్రం అంతగా అవకాశాలు అందుకోలేదు. గ్లామర్ బ్యూటీగా వెండితెరపై సంచలనం సృష్టించిన ఈ అమ్మడు.. ఇప్పుడు సినిమాలతోపాటు.. ఇటు సోషల్ మీడియాలోనూ సైలెంట్ అయ్యింది. తాజాగా ఈ వయ్యారి లేటేస్ట్ ఫోటోస్ తెగ వైరలవుతున్నాయి. మంగుళూరుకు చెందిన నేహా శెట్టి.. చిన్న వయసులోనే మోడలింగ్ రంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత 2014లో మిస్ మంగుళూరుగా కిరీటాన్ని దక్కించుకున్నారు. ఆ తర్వాత 2015లో మిస్ సౌతిండియా పోటీల్లో రన్నరప్ గా నిలిచింది.

## తీహార్ జైలుకు బాలీవుడ్ నటుడు రాజ్ పాల్ యాదవ్

బాలీవుడ్ నటుడు రాజ్ పాల్ యాదవ్ గురువారం తీహార్ జైలు అధికారుల ముందు లొంగిపోయారు. చెక్ బౌన్స్ కేసులో ఢిల్లీ హైకోర్టు ఆయనకు జైలు శిక్ష విధించింది. ఈ నెల 2న సరెండర్ కావాలని ఆదేశించగా.. గడువు పెంచాలంటూ రాజ్ పాల్ విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన హైకోర్టు.. వెంటనే లొంగిపోవాలంటూ బుధవారం ఆదేశాలు జారీ చేసింది.

**చెక్ బౌన్స్ కేసు..**

తమ సంస్థ నుంచి తీసుకున్న రుణాన్ని చెల్లించేందుకు రాజ్ పాల్ యాదవ్, ఆయన భార్య ఇచ్చిన చెక్ బౌన్స్ అయిందంటూ మురళీ ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 2018లో కోర్టును ఆశ్రయించింది. ఈ కేసును విచారించిన ఢిల్లీ హైకోర్టు.. రాజ్ పాల్ దంపతులను దోషులుగా తేల్చింది. రాజ్ పాల్ కు ఆరు నెలల జైలు శిక్ష విధించింది. దీనిపై నటుడు అప్పీల్ చేసుకోగా 2019లో సెషన్స్ కోర్టు కూడా ఈ శిక్షను సమర్థించింది. దీనిని సవాలు చేస్తూ రాజ్‌పాల్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు.

**హైకోర్టు స్టే..**

2024 లో ఢిల్లీ హైకోర్టు రాజ్ పాల్ కు విధించిన జైలుశిక్షపై స్టే విధించింది. రాజీ కుదుర్చుకోవాలంటూ రాజ్ పాల్ కు సూచించగా.. మురళీ ప్రాజెక్ట్స్ కు డబ్బు చెల్లిస్తానని రాజ్ పాల్ కోర్టుకు హామీ ఇచ్చారు. అయితే, ఆయన మాట నిలబెట్టుకోలేకపోవడంతో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ జైలు అధికారుల ముందు లొంగిపోవాలని ఆదేశించింది.

## సలహాలన్నీ తీసుకోవాలి.. కానీ సరిపోయేది ఎంచుకోవాలి: మోదీ

సలహాలు అన్నీ తీసుకోవాలి కానీ మనకు సరిపోయే సలహానే ఎంచుకోవాలి'' అని ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులకు సూచించారు. చదువు, విశ్రాంతి, అలవాట్లు, నైపుణ్యాలను మెరుగుపర్చుకోవడంలో ఒక బ్యాలెన్స్ ఉండేలా చూసుకోవాలని చెప్పారు. ఆటలను సరదాగా తీసుకోవద్దని, అదొక నైపుణ్యమని హితవు పలికారు. ఈ మేరకు 'పరీక్షా పే చర్చ' కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ విద్యార్థులతో ముచ్చటించారు. పనితీరుకు సంబంధించి ప్రజలు తనకు ఎన్నో విషయాలు చెబుతుంటారని, వారు ఇచ్చే సలహాలు అన్నీ దేశ ప్రధానిగా తాను స్వీకరిస్తానని మోదీ చెప్పారు. ఇలా స్వీకరించిన సలహాలు సూచనలతోనే తన పనివేళల్లో మార్పులు చేసుకున్నట్లు విద్యార్థులకు వివరించారు. అయితే, తాను విలువలను మాత్రం వదులుకోలేదని వివరించారు. ఈ సందర్భంగా జూదం జోలికి వెళ్లవద్దని వారిని హెచ్చరించారు.




## మద్రాస్ హైకోర్టులో హీరో విజయ్‌కు నిరాశ



కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ దళపతికి మద్రాస్ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆదాయపు పన్ను ఎగవేతకు సంబంధించి విధించిన రూ.1.50 కోట్ల జరిమానాను రద్దు చేయాలన్న పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. జరిమానా విధించిన ఆదాయపు పన్ను శాఖ ఉత్తర్వుల్లో ఎలాంటి చట్టవిరుద్ధం లేదని న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్ కుమార్ రామమూర్తి స్పష్టం చేశారు. 2015—16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విజయ్ తన ఆదాయపు పన్ను రిటర్న్‌లో సుమారు రూ.35.42 కోట్ల ఆదాయం ప్రకటించారు. అయితే 'పులి' సినిమా ద్వారా వచ్చిన రూ.15 కోట్ల ఆదాయాన్ని ఖాతాల్లో చూపలేదని ఆదాయపు పన్ను శాఖ గుర్తించింది. 2015లో ఆయన నివాసంలో జరిగిన సోదాల్లో లభించిన పత్రాలను ఆధారంగా తీసుకుని ఈ విషయం బయటపడింది. దీనిపై 2022లో ఐటీ శాఖ రూ.1.50 కోట్ల జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ విజయ్ మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా, తొలుత కోర్టు మధ్యంతర స్టే మంజూరు చేసింది. అనంతరం ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు గత నెలలో తీర్పును రిజర్వ్ చేసి, తాజాగా పిటిషన్‌ను తిరస్కరించింది. విజయ్ తరఫు న్యాయవాది వాదన ప్రకారం, చట్టపరంగా జూన్ 30, 2019లోపే జరిమానా ఉత్తర్వులు రావాల్సి ఉండగా 2022లో ఆలస్యంగా జారీ చేయడం చెల్లదని తెలిపారు. అయితే ఆదాయపు పన్ను శాఖ తరఫు న్యాయవాది, చట్ట నిబంధనల ప్రకారమే జరిమానా విధించామని వాదించారు. ఈ వాదనలను పరిశీలించిన కోర్టు, ఐటీ శాఖ నిర్ణయంలో తప్పేమీ లేదని తేల్చింది.

## మళ్లీ తగ్గిన బంగారం, వెండి ధరలు

దేశీయంగా బంగారం, వెండి ధరలు మళ్లీ తగ్గాయి. హైదరాబాద్ మార్కెట్‌లో శుక్రవారం 24 క్యారెట్ల 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1.58 లక్షలు పలుకుతోంది. గురువారంతో పోలిస్తే దాదాపు రూ.1600 తగ్గింది. అదేవిధంగా 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,39,650గా ఉంది. ఇక కిలో వెండి ధర రూ.9 వేలు దిగొచ్చింది. ప్రస్తుతం రూ.2.60 లక్షలు పలుకుతోంది. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లోనూ బంగారం, వెండి లోహాల ధరలు తగ్గుముఖం పట్టాయి. ఔన్సు పసిడి ధర 4,864 డాలర్లు, ఔన్సు వెండి ధర 74 డాలర్లుగా కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి డెలివరీ కాంట్రాక్టుకు వెండి 2 శాతం తగ్గి కిలో ధర రూ.2.38 లక్షల వద్ద ఉంది. ఏప్రిల్ డెలివరీలకు పసిడి ధర స్వల్పంగా పెరిగి 10 గ్రాముల ధర రూ.1.52 లక్షలకు చేరింది. భారీగా పెరిగిన బంగారం, వెండి ధరలు తిరోగమనం పట్టడంతో మదుపర్ల నుంచి అమ్మకాల ఒత్తిడి పెరిగింది. దాంతో ధరలు మరింత తగ్గుతున్నాయి.